# పతితుని హృదయం

## వట్టికోట ఆళ్వారుస్వామి

**1915-1960**

తెలంగాణా వైతాళికులలో తలమానికం, వివిధ సాహిత్య ప్రక్రియలలో గట్టి కోట. కథ, నాటకం, నవల అన్నింటా ఆయనది అందెవేసిన చేయి. అసలు 'పన్నిద్దరు ఆళ్వారులే గాని మా వట్టికోట మరియొక ఆళ్వారు' అని దాశరథి అన్నారు. 'దేశోద్ధారక గ్రంథమాల' స్థాపించి అనేక పుస్తకాలు ప్రచురించారు. నల్లగొండ, చెరువు మాధవవరంలో పుట్టి పెరిగిన ఈ స్వామి తెలంగాణా పోరాటాన్ని, నైజాం నిరంకుశ పాలనను తీవ్రంగా ఎదిరించి, జైలు జీవితం గడిపారు. జైలు లోపల కథలు, ప్రజల మనిషి, గంగు నవలలు వీరి రచనలలో ప్రసిద్ధికెక్కాయి. తెలంగాణాలో వివిధ రంగాలకు సంబంధించిన సమాచారంతో వీరు ప్రచురించిన వ్యాస సంపుటి అప్పటికీ, ఇప్పటికీ సమగ్రమైంది.

'అంతా వచ్చారా? ఏం, మగ్గాల చప్పుడు కావడం లేదే?' అంటూ అధికార ధ్వనిలో డఫేదారు తిరుపతయ్య నేతశాలలో ప్రవేశించి లోపలున్న ఖైదీలను లెక్కించసాగాడు.

అక్కడక్కడ ఇద్దరు, ముగ్గురు కూడి, ఆనాడు ఉదయం ఉరితీయబడ్డ వ్యక్తి గురించి మాట్లాడుకుంటున్న ఖైదీలు తిరుపతయ్య రాగానే తమ స్థానాల్లోకి వెళ్లి కూర్చున్నారు.

'గండయ్య రానట్టుందే?' తిరుపతయ్య ప్రశ్నించాడు.

'రాలేదు సార్' ఒక ఖైదీ జవాబిచ్చాడు.

'ఎంత చెప్పినా వాడికి బుద్ధి రాదు. ఎప్పుడూ ఎక్కడో తిరుగుతుంటాడు. ఎక్కువ శిక్షవాడని నేను కొంచెం చనువుగా మెదులుతుంటుంటే అధికారులతో నాకు మాట తెచ్చేలాగున్నాడు' అంటూ నేతశాల వదిలి 'మగ్గాలు ఆడనివ్వండి' అని ఆజ్ఞాపించి గండయ్య కొరకు బయల్దేరాడు తిరుపతయ్య.

తిరుపతయ్య అటు పోగానే ఖైదీలు మళ్లీ మాటల్లో పడ్డారు.

'చూచావురా! తిరుపతయ్య ముఖంలో ఇంతన్నా విచారముందో?'

'విచారమెందుకురా! వాడెవడు, వీడెవడు?'

'పాపం! ఉరితీసిన సంగతి అతని వాండ్లకు తెలుపుతారో, లేదో.'

'తెలిసికొని మాత్రము ఎవరు ఏం చేస్తారు? వచ్చిన దగ్గరికి చేరుకున్నాడు.'

'అది కాదు కాని, ఓ మనిషిని ఇంకో మనిషి చేతులు కట్టి, ఉరిపెట్టి వ్రేలాడదీస్తే చచ్చిందాక గుడ్లు మిటకరిస్తూ చూడటానికి అక్కడ నిలుచున్న వాండ్లకెట్లా మనసొప్పిందో? నాకైతే అతని పీనిగెను చూడటానికి గూడ మనసొప్పలేదురా!'

'ఏమి వగలమారి మొగోడివిరా. రేపు నీకు జవాను కొలువిచ్చి ఉరి తీయమంటె తీయక ఏం

### ఆణిముత్యాలు

చేస్తావు? ఖానూను ప్రకారం ఎవరైనా చేయాల్సి వస్తుందోయ్! ఖానూనంటే ఏం, పిల్లకాయలాటనుకున్నావా?'

ఈ విధంగా ఖైదీలు చర్చించుకుంటుండగా తిరుపతయ్య గండయ్యను వెంటబెట్టుకుని నేతశాలకు వచ్చి, మగ్గాల పని ఆగి ఉండుటను చూచి 'మీకేమైంది ఈ రోజు. పని బొత్తిగా చేయడం లేదు. చెప్తున్నాను బాగా వినండి. మీ అందరిని దొర దగ్గరకు తీసికెళ్ల నిలబెడ్తా' హెచ్చరించాడు తిరుపతయ్య.

తిరుపతయ్య వెనుక నిలబడి విచారంతో తల

నేలకు వేసి వున్న గండయ్య 'దొరదగ్గరికెందుకు? ఉరి దగ్గరికి తీసుకెళ్లరాదూ?' అంటూ కండ్ల నీరు తుడుచుకున్నాడు.

గండయ్య కంటినీరు చూడగానే తిరుపతయ్య చలించిపోయాడు. 'ఈవాళ గండయ్య నాటకమాడుతున్నాడే. ఆడదానిలాగ ఏడ్వటం మొదలుపెట్టాడు. ఒక్కసారైనా వాడి ముఖం చూచావో లేదో. వాడు చస్తే చుట్టం చచ్చినట్టు ఏడుస్తావెందుకు?' తిరుపతయ్య టోపి క్రిందబెట్టి బీడీ కాలుస్తూ అడిగాడు.

'మా ఖైదీలకు చుట్టాలము మేము కాకపోతే నీవవుతావా? తిరుపతయ్యా, పిల్లలు గలవాడివి. సంసారం చేస్తున్నావు కూడ. 25 ఏండ్ల వయసు కుర్రోడ్ని పెండ్లి కొడుకోలె పట్టుకెళ్లి స్తంభాని కేలాడదీయడానికి నీకు చేతులెట్లా వచ్చాయి? నీకు కోపమొస్తే మానె గాని నీవు మనిషివి కావయ్యా!' అని గండయ్య గంభీరంగా అన్నాడు.

'పిచ్చోడా. నేను కాకపోతే ఇంకోడు తయారవుతాడు ఈ పనికి. ఉరి తీయడానికి మనుషులు లేక ఉరితీయడం ఆగిపోతుందను కున్నావా?' తిరుపతయ్య నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు ముసిముసిగా నవ్వుతూ.

'నీ సంగతే కాదు నేను అనేది. ఉరితీసే వాండ్ల గురించే అడుగుతున్నాననుకో. ఎవడు ఈ పద్ధతి పెట్టిండో గాని ఉరితీసిందాని కంటె 50 ఏండ్లో 60 ఏండ్లో జైల్లో ఉంచింది మంచిది' గండయ్య అన్నాడు.

'లేకుంటే నీ పద్ధతి అంటే, నీ గ్యాంగు పద్ధతితో చేస్తే ఇంకా బాగుంటుందిరా?' అంటూ హేళనగా నవ్వాడు తిరుపతయ్య.

'తిరుపతయ్య సార్! మాకంటే నీవు మెరుగని సంతోషిస్తున్నావ్? నీవేమైనా అనుకో, మనసు మండి అనేస్తున్నాను. మేము తప్పు చేస్తే జైలుశిక్ష వేసినవాండ్లు ఒక మనిషిని ఉరితీసిన వాడికి కూడా కఠినశిక్ష వేస్తే బాగుంటుంది' గండయ్య కోపంతో అన్నాడు.

'నేను ఖానూను ప్రకారము ప్రభుత్వ ఆజ్ఞతో ఉరితీశాను తెలుసా! నన్నెవరు శిక్షిస్తారు? సరేకాని, మాటలు చాలా అయినవి. ఇక పోయి మగ్గము

## హైకూలు

వానలో తడిసి
భూమిలో కరిగిపోయింది
రాత్రిరి

◆ ◆ ◆

చెరువులో వాన
జోరుగా కురుస్తోంది
నీళ్లు వణుకుతున్నాయి

◆ ◆ ◆

చిరుజల్లు గిలిగింత పెట్టింది
మొక్కలూ పూలూ
నవ్వుతున్నాయి

◆ ◆ ◆

బీడు నేలలో
మొలిచి ఎండిన
మొక్కే 'అనంత' రైతు

◆ ◆ ◆

ఆకాశంలో రామచిలుకలు
ఎర్రపూలు పూచిన మొక్కలై
ఎగురుతున్నాయి

◆ ◆ ◆

ఇప్పుడే వర్షం వెలిసింది
చెట్టును కదల్చకండి
భోరున ఏడుస్తుంది

◆ ◆ ◆

గాలి సముద్రాన్ని
ఈదుతున్న పడవ
గాలిపటం

◆ ◆ ◆

చెట్లు నేలపై
మేఘాలు కొండలపై
నీడల్ని ఆరేసుకున్నాయి

– చిలుకూరి దీవెన

మీద కూర్చోపో. దొర వచ్చే వేళైంది' అంటూ తిరుపతయ్య డ్రెస్ సదరుకొంటూ గేటు వద్ద నిలుచున్నాడు.

'నేను ఇవాళ దొరను కూడా అడుగుతా. ఏమైనా గాని. ఇంత అన్యాయంగా ఉరితీయడం బాగలేదని' అని గండయ్య కూడా తిరుపతయ్య పక్కన నిలుచున్నాడు.

తిరుపతయ్య కోపం నటిస్తూ– 'ఒరే! నీకు సిగ్గెందుకు లేదు. నీవు మీ గ్యాంగు వాళ్లు కలిసి ఎంతమంది ప్రాణాలు తీశారురా? ఎంతమంది పెండ్లిండ్లను ఎత్తకొట్టారురా? ఎన్ని కొంపల్ను నాశనం చేశారురా? అటువంటి నీవు ఎవరినో ఉరితీసినందుకు ఏడుస్తున్నావు? ఏమేమో వాదిస్తున్నావా? పైగా దొరను అడుగుతాడట. దొరను. ఎప్పుడైతివి పత్తిత్తువు' అని గట్టిగా మందలించాడు తిరుపతయ్య.

గండయ్య కడుపులోని దుఃఖము ఇప్పుడు రౌద్రరూపము దాల్చింది. తానొక ఖైదీనని, అధికార సిబ్బందిలోని ఒక వ్యక్తితో మాట్లాడుతున్నాననే సంగతే మరిచిపోయాడు. ఉగ్రుడై 'మాటికి మాటికి మాతో పోల్చుకోవడానికి నీకు నోరెట్లా వస్తుంది. తప్పత్రాగి, ఉడికీ ఉడకని మాంసము తిని, బజారు ముండలతో కాలము గడిపే మేము ఒళ్లు మరచి ప్రాణాలు తీశాం. దార్లుకొట్టి పెండ్లి పిల్లలపై నగలు అపహరించాం. ఇండ్లలో జొరబడి దోచుకున్నాం. మత్తు దిగింతర్వాత ఒక్కొక్కప్పుడు మా చేష్టలకు మేమే పశ్చాత్తాపపడ్డాం. మేము చదువురాని మొద్దులం. మాలో చదివినోడు గాని, మంచి చెడ్డ తెలిసినోడు గాని ఒకడుండడు. చిన్నప్పటి నుండి దొంగల సావాసంలో పెరిగాం. వాండ్లలో తిరిగాం. అవే బుద్ధులు, అదే బతుకు.

ఇప్పటికైనా మమ్ముల ఈ పని నుండి మాన్పించి మంచి విద్యావంతులుగా, బుద్ధిమంతులుగా తయారు చేయడానికెవరైనా ముందుకొస్తే మా గ్యాంగు మాటేమోగాని నా వరకు నేను సిద్ధంగా వున్నాను.

మరి నీ సంగతేమంటావు? ఏదో ఖానూను ప్రకారమని అన్నావే. చదువుకున్న పెద్దలు, మావంటి వాండ్లను జైల్లో పెట్టి బాగుచేయతలచుకున్న పెద్దలు, మనిషిని చంపేదానికి ఖానూను వ్రాస్తే వాండ్ల నుండి మావంటి వాండ్లు ఏం నేర్చుకోవాలె? ఒకడు మనిషిని చంపడమే తప్పు అంటున్న ఖానూను, ఇంకొకడిని ఉరితీసి చంపమని ఎట్లా అంటుంది? మాట్లాడవేం! తిరుపతయ్యా సార్!' గండయ్య గుడ్లెర్రజేసి గట్టిగా అడిగాడు.

తిరుపతయ్య వింతగా గండయ్య వైపు చూస్తూ, 'ఒరే! నీకు పిచ్చిలేసేటట్టున్నదిరా పో! లోపలికి పో! దొర వస్తున్నాడు' అంటూ తిరుపతయ్య క్రమశిక్షణతో నించున్నాడు. గండయ్య కూడా దూరంగా నిలుచొని జేలరు వచ్చే వైపు చూస్తున్నాడు.

జేలర్, జేలర్ వెంట జమేదార్ గేటు లోపలికి ప్రవేశించగానే జమేదారు రౌద్రముతో గండయ్య నుద్దేశించి 'ఏమిరా? నీవు ఈ రోజు గంజి తీసుకోలేదేం?'

గండయ్య జేలరుకు దండం పెట్టి 'అయ్యా! ఉరితీసినప్పటి నుండి నాకు కడుపులో ఎట్లాగో వుంది. నాకెటు తోచడం లేదు. మీరు చదువుకున్నోరు కూడా ఇటువంటి పనులు చేస్తే ఇక మా సంగతి ఎవరు అడుగాలె' అని గండయ్య ప్రశ్నించాడు.

జమేదారు అధికార ధ్వనిలో 'నీవు గంజి త్రాగుతావా లేదా?' అని గర్జించుమా ఓరకంటితో జేలరు వైపు చూచాడు.

జేలర్ అయోమయ స్థితిలో కపట బింకంతో తలనాడించాడు.

'తాగను సార్!' గండయ్య నిర్భయంగా జవాబిచ్చాడు.

'ఒంటిగదిలో మూసేసి తర్వాత నా వద్దకు తీసికొని రండి. వాడికి మంచిగా బుద్ధి చెప్పితే రోగం కుదురుతుంది. గంజి తాగుతాడు. చదువుకున్నోళ్ల సంగతి తెలుస్తుంది' అంటూ వెళ్లిపోయాడు జేలరు.

**('జైలు లోపల' కథా సంపుటి, 1952)**

●